క్లుప్తంగా

బడ్జెట్ సమావేశం రేపు

బాడంగి: మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ బడ్జెట్ సమావేశం ఈ నెల 30వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎస్.రామకృష్ణ ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. ఎంపీపీ భోగి గౌరి అనుమతి మేరకు 2024-25 బడ్జెట్ సవరణతో పాటు 2025-26 అంచనా బడ్జెట్ ప్రవేశపెట్టడం జరుగుతుందన్నారు. ఎంపీటీసీ సభ్యులు, కో-ఆప్టెడ్ సభ్యులు హాజరుకావాలని కోరారు.

మండల కేంద్రాల్లోనే శిక్షణ ఇవ్వాలి

బాడంగి: విశ్వకర్మ కౌశల్య యోజన పథకం ద్వారా ఎంపికైన దరఖాస్తుదారులకు తమ తమ మండల కేంద్రాల్లోనే శిక్షణ ఇవ్వాలని విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు ముగడ వెంకటరమణ కోరుతున్నారు. ఇదే విషయమై ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ గత రెండేళ్లుగా కొనసాగుతున్న ఈ పథకానికి 86 కులాలకు చెందిన వారు అర్హులు కాగా, ఈ ప్రాంతంలోని వారికి శిక్షణ ఇచ్చేందుకు గజపతినగరం మండలానికి రావాలని చెబుతున్నారని, అలా అయితే వ్యయప్రయాసలకు దరఖాస్తుదారులు లోనవుతారన్నారు. వారి కష్టాన్ని అర్థం చేసుకుని, వారికి వారి మండల కేంద్రాల్లోనే శిక్షణ ఇచ్చేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

చురుగ్గా రోడ్డు మరమ్మతు పనులు



రోడ్డు బాగు చేస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్...

తెర్లాం: మండలంలోని ఎం.ఆర్.అగ్రహారం, ఉత్తరావల్లి గ్రామాల మధ్య పాడైన రోడ్డు మరమ్మతు పనులు గురువారం చేపట్టారు. ఈ నెల 18వ తేదీన సాక్షి దినపత్రికలో 'అధ్వానంగా రోడ్డు.. జనం అవస్థలు! అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఆర్అండ్ బీ అధికారులు గోతులమయమైన ఈ రోడ్డును బాగు చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు టీవీలు అందజేత

బొబ్బిలిరూరల్: మండలంలోని కలువరాయి గ్రామంలో ఉన్న మూడు అంగన్‌వాడీ కేంద్రాలకు టీవీ(టెలివిజన్)లు, వంటపాత్రలు, పిల్లల ఆటసామగ్రి, స్టడీ మెటీరియల్‌ను హోలిస్టిక్ హెల్త్ సొసైటీ చైర్మన్ లక్ష్మి గురువారం అందజేశారు. ఎస్‌బీఐ(స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా) సీఎస్ఆర్ నిధులతో వీటిని కొనుగోలు చేయగా, అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి ఎస్‌బీఐ ముందుకురావడం చాలా ఆనందంగా ఉందని ఆమె అన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ మేనేజర్ ప్రవీణ్‌కుమార్, ప్రాజెక్ట్ డైరెక్టర్ పునీత తదితరులు పాల్గొన్నారు.

రూ.కోటి పరిహారం ఇవ్వాలి

బొబ్బిలి: స్థానిక డిప్యూటీ ఈవో కార్యాలయం ఎదుట బొబ్బిలి యూటీఎఫ్ డివిజన్ సంఘం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు గురువారం నిరసన చేపట్టారు. ఎస్ఎల్‌డీపీఎఫ్ఎల్ఎన్ శిక్షణ రెసిడెన్షియల్ పద్ధతిలో ఇస్తుండడం వల్ల ఉపాధ్యాయులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే శిక్షణలో పాల్గొని, సిరిపురం శ్రీనివాసరావు అనే ఉపాధ్యాయుడు గుండెపోటుతో మరణించారని, దీనికి కారణం ఈ తరహా శిక్షణలేనని బాధిత కుటుంబానికి రూ.కోటి పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కేశవరావు, మండల కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



రామభద్రపురం నుంచి బొబ్బిలి వెళ్లే దారిలో ప్రమాదకర మలుపు

కూడళ్లు.. యమ డేంజర్!

- జాతీయ రహదారిలో ప్రమాదకరంగా కూడళ్లు
- వందల సంఖ్యలో దుర్ఘటనలు
- పలు జంక్షన్‌ల వద్ద ఇటీవల వరుస ప్రమాదాలు
- పదుల సంఖ్యలో మృత్యువాత
- స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని స్థానికుల విజ్ఞప్తి

రామభద్రపురం:

మండలంలోని జాతీయ రహదారిలో పలు కూడళ్లు యమ డేంజర్‌గా మారాయి. పలు జంక్షన్‌ల వద్ద ఇప్పటికే వందల సంఖ్యలో ప్రమాదాలు జరగ్గా, పదుల సంఖ్యలో మృత్యువాత పడ్డారు. మరికొంత మంది తీవ్రగాయాలతో చికిత్స పొంది, మంచాన పడగా ఇంకొంత మందికి కాళ్లు, చేతులు విరిగి అటు.. ఇటు.. నడవలేక జీవచ్ఛవాలుగా బతుకుతున్నారు. స్థానిక బైపాస్ రోడ్డు మీదుగా సాలూరు వైపు వెళ్లే 26వ నంబరు జాతీయ రహదారిలో కనిమెరక వీధికి, గొర్లె వీధికి మధ్య జంక్షన్‌లో పదుల సంఖ్యలో ప్రమాదాలు జరగడంతో పలువురు మృత్యువాత పడగా, మరికొంత మంది జీవితాంతం క్షతగాత్రులుగా మిగిలిపోయారు. ఈ నెల 26వ తేదీ రాత్రి కూడా అదే జంక్షన్‌లో ఇదే గ్రామానికి చెందిన ఓ యువకుడు రోడ్డు ప్రమాదానికి గురై



కనిమెరక, గొర్లె వీధుల మధ్యలోని జంక్షన్‌లో బోల్తాపడిన చెక్కబొత్తు లారీ(ఫైల్)



రామభద్రపురం మలుపు వద్ద సాగునీటి కాలువలోకి దూసుకెళ్లిన కారు(ఫైల్)

మృతి చెందాడు. దీంతో ఆయన భార్య, పిల్లలు కుటుంబాన్ని పోషించే ఓ పెద్ద దిక్కును కోల్పోయారు. అలాగే ఇదే నెల 27వ తేదీన కొట్టక్కి జంక్షన్ వద్ద ఏఎన్ఎం తన భర్తతో ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, వెనక నుంచి వచ్చిన ఓ లారీ ఢీకొట్టింది. దీంతో ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయి ఓ కార్పొరేట్ ఆస్పత్రిలోని ఐసీయూలో చికిత్స పొందుతోంది. ఇదే నెల 25వ తేదీన కూడా ఆరికతోట జంక్షన్ వద్ద రోడ్డు దాటుతుండగా, రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఆయా వాహనదారులకు తీవ్ర గాయాలయ్యాయి. వారు కూడా ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చేరి, చికిత్స పొందుతున్నారు. ఇదంతా పోలీసులతో పాటు అందరికీ తెలిసిందే. ప్రమాద కూడళ్ల వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయకపోవడం వల్ల అతి వేగంగా వాహనాలు నడపడంతోనే ఈ ప్రమాదాలన్నీ జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు దాటడం కష్టమే..

స్థానిక ఉన్నత పాఠశాల వద్ద విద్యార్థులు రోడ్డు దాటేందుకు కష్ట పడుతున్నారు. వాహనాల రద్దీ ఎక్కువగా ఉండడం, విద్యార్థులు, ప్రజలు ఎక్కువగా రాకపోకలు సాగించడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో చెప్పలేని పరిస్థితి నెలకొంది. స్కూల్ జోన్ జంక్షన్‌ల వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయకపోవడం వల్ల వాహన చోదకులు అతివేగంగా తమ వాహనాలు నడపడంతో రోడ్డుకు ఒక వైపు నుంచి మరో వైపు రోడ్డు దాటాలంటే భయపడుతూ దాటాల్సిన దుస్థితి. పాఠశాలకు విద్యార్థులు వచ్చినప్పుడు, పాఠశాల విడిచి పెట్టినప్పుడు వాహనాల అతివేగంతో పాటు రద్దీ ఎక్కువగా ఉండడం వల్ల రోడ్డు దాటేందుకు విద్యార్థులు భయపడుతున్నారని ఉపాధ్యాయులు చెబుతున్నారు. స్థానిక ఉన్నత పాఠశాల, ఆర్టీసీ కాంప్లెక్స్, ప్రమాదకర మలుపుల వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని విద్యార్థులు, స్థానికులు, వాహన చోదకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అప్రోచ్ రోడ్డు లేకపోవడంతో..

జాతీయ, రాష్ట్ర రహదారుల్లో ఉన్న ప్రమాదకర మలుపుల వద్ద అప్రోచ్ రోడ్డు నిర్మించకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మండల కేంద్రం అంతర్ రాష్ట్ర కూడలి కావడంతో భారీ వాహనాలు, కార్లు, ద్విచక్ర వాహనాలు దూసుకెళ్లడంతో మలుపుల వద్ద ఎప్పటికప్పుడు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆ ప్రమాదాలు జరుగుతున్నప్పుడు పోలీసులు, ఆర్అండ్‌బీ అధికారులు వచ్చి హడావిడి చేస్తున్నారే తప్ప అప్రోచ్ రోడ్ల నిర్మాణంపై దృష్టి సారించడం లేదన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

మలుపులు.. ప్రమాదానికి పిలుపులు..

రామభద్రపురం–బొబ్బిలి, రామభద్రపురం–రాజాం ఆర్అండ్‌బీ రోడ్లలో పలుచోట్ల ఉన్న మలుపులు ప్రమాదాలకు పిలుపునిచ్చేవిగా ఉన్నాయి. రామభద్రపురం సమీపంలోని బొబ్బిలి వెళ్లే రోడ్డులో మహీంద్రా షోరూమ్ వద్ద ఉన్న మలుపు దగ్గర ఎటువంటి హెచ్చరిక బోర్డులు గానీ స్పీడు బ్రేకర్లు గానీ ఏర్పాటు చేయకపోవడంతో అటువైపుగా వాహనాలు అతివేగంతో దూసుకుపోతున్నాయి. రాత్రి వేళల్లో రాకపోకలు సాగించే వందలాది వాహనాలు ఎదురెదురుగా వస్తున్న వాహనాలను తప్పించబోయి కనురెప్పపాటులో వాహనాలు ఢీకొని పలువురు ప్రాణాలు వీడుతున్నారు. వందలాది మంది శాశ్వతంగా క్షతగాత్రులుగా మిగులుతున్నారు. ఫలితంగా వారిని నమ్ముకున్న కుటుంబాలు వీధిన పడుతున్నాయి.

నివారణ చర్యలు చేపడతాం..



ప్రమాదాల నివారణకు చర్యలు చేపడతాం. డేంజర్ జంక్షన్లు, ప్రమాదకర మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు లేదా స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేస్తాం. మలుపుల వద్ద అప్రోచ్ రోడ్డు నిర్మించాలని ఆర్అండ్‌బీ అధికారులకు లేఖ రాస్తాం.

–వి.ప్రసాదరావు, ఎస్ఐ, రామభద్రపురం

చెరువు ఆక్రమణపై దర్యాప్తు



చెరువు ఆక్రమణ ఫిర్యాదుపై దర్యాప్తు చేస్తున్న తహసీల్దారు చిన్నారావు



ఆక్రమణకు గురవుతున్న చెరువు ఇదే..

రేగిడి: మండలంలోని సంకిలి గ్రామ సమీపంలో ఉన్న ఈఐడీ ప్యారీ సుగర్ ఫ్యాక్టరీ సమీపంలో ఉన్న అవుట్ చెరువు ఆక్రమణకు గురవుతున్నట్లు ఈ నెల 26వ తేదీన ఆన్‌లైన్‌లో అధికారులకు కొంతమంది ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తహసీల్దారు చిన్నారావుతో పాటు మరికొంత మంది అధికారులు ఆక్రమణలు జరుగుతున్న ప్రాంతాన్ని గురువారం పరిశీలించారు. ఫిర్యాదు చేసిన అప్పాపురం మాజీ సర్పంచ్ కరణం శ్రీనివాసరావుతో పాటు సంకిలి సర్పంచ్ బుడుమూరు పట్టాభి, చెరువు ఆయకట్టు రైతులను అక్కడికి పిలిచి, విచారణ చేశారు. చెరువు మొత్తం 11 ఎకరాల విస్తీర్ణం ఉండాలని, అయితే చెరువుతో పాటు ఆ పక్కనే ఉన్న నాయుడువాని చెరువు కూడా ఆక్రమణకు గురవుతోందని తెలిపారు. ఫ్యాక్టరీ పరిధిలో డిస్టలరీ ప్లాంట్లు నిర్మిస్తున్నారని ఆరోపించారు. చెరువులు పూర్తిగా కప్పి వేస్తుండడంతో ఈ ఏడాది ఆయకట్టులో వరి పంటలు పండలేదని, భవిష్యత్తులో తమ పంటపొలాల పరిస్థితి ఏమిటని రైతులు ప్రశ్నించారు. మూడు రోజుల్లో డిజిటల్ విధానం ద్వారా చెరువుల విస్తీర్ణాన్ని నిర్ధారించి, ఆక్రమణలు తొలగిస్తామని రైతులకు తహసీల్దారు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్ఐ రేవతి, మండల సర్వేయరు అప్పలనాయుడు, వీఆర్వో తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వానిది వేధింపుల పాలన



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పించిన అనంతరం మీడియాతో మాట్లాడుతున్న పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్

- వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్

రాజాం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ ఆరు నెలల పాలనలో ప్రజలను వేధించడం తప్ప చేసిందేమీ లేదని వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ విమర్శించారు. స్థానిక పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మహాత్మా జ్యోతీరావు పూలే 134వ వర్ధంతి గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. సామాజిక న్యాయం సాధించడంలో పూలే ఆశయాలు చాలా గొప్పవని కొనియాడారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కూటమి సర్కారు పాలనపై నిప్పులు చెరిగారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చలేక డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని ధ్వజమెత్తారు. నిత్యం వైఎస్సార్‌సీపీని ఆడిపోసుకోవడం తప్ప ప్రజలు మెచ్చే ఏ ఒక్క పనీ చేయడం లేదన్నారు. కక్ష సాధింపు పాలనలో చంద్రబాబు తన ప్రతాపాన్ని చూపిస్తున్నారని దుయ్యబట్టారు. కుట్రలు, అరాచకాలు, దాడులు, యథేచ్ఛగా దోపిడీలు, అన్నింటా వైఫల్యాలు ఇవీ ఈ చంద్రబాబు ప్రభుత్వ ఘనకార్యాలన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, మహిళలకు రక్షణ కూడా కొరవడిందన్నారు.

ఉద్యోగాల్లో నుంచి తీసేశారు..

ఉద్యోగాలు లేక, నిరుద్యోగ భృతి లేక యువత మోసపోయిందన్నారు. గతంలో ఉన్న వలంటీర్లను తొలగించేశారని, వలంటీర్లను కొనసాగించి, జీతాలు పెంచుతామన్న హామీలు గాలిమూటలేనన్నారు. ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న 15 వేల మందిని సైతం ఉద్యోగాల్లోంచి తీసేశారని, 104, 108 వాహనాల సిబ్బంది ప్రస్తుతం సమ్మెబాట పట్టారన్నారు. మెగా డీఎస్సీ ప్రకటనే తప్ప పరీక్ష నిర్వహణ లేదన్నారు. సంపద సృష్టి పోయి అప్పుల ఆంధ్ర ప్రారంభమైందని, రూ.వేల కోట్లు అప్పులు చేస్తూ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో తోసేస్తున్నారన్నారు. గతంలోని జగనన్న ప్రభుత్వం మొత్తం 17 మెడికల్ కళాశాలల నిర్మాణం చేసి, వాటిలో ఐదింటిని గత విద్యా సంవత్సరంలోనే ప్రారంభిస్తే, ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క కళాశాలను కూడా ప్రారంభించలేదన్నారు. పేరుకే ఉచిత ఇసుక అని, ఎక్కడా ఉచితంగా ఇసుక ఇవ్వడం లేదన్నారు. గ్రామాల్లో బెల్టుషాపుల నిర్వహణ జరుగుతున్నా కఠిన చర్యలు లేవన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య, వైఎస్సార్ సీపీ రాజాం పట్టణ, రూరల్ కన్వీనర్లు పి.శ్రీనివాసరావు, ఎల్.రాజగోపాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలి



రెవెన్యూ సిబ్బందితో సమావేశమైన ఆర్‌డీవో సత్యవాణి

వంగర: రైతుల భూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని చీపురుపల్లి ఆర్‌డీవో సత్యవాణి సూచించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో గురువారం సమావేశమైన ఆమె.. రెవెన్యూ సదస్సుల్లో రైతులు చేస్తున్న ఫిర్యాదులను మూడు రోజుల్లోగా పరిష్కరించాలని ఆదేశించారు. వీఆర్‌వోలు, సర్వేయర్లు సంయుక్తంగా పనిచేయాలని తెలిపారు. రైతుసేవా కేంద్రాల ద్వారా రైతులు పండించిన ప్రతీ ధాన్యం గింజనూ కొనుగోలు చేయాలన్నారు. ధాన్యం కొనుగోళ్లకు గన్నీ బ్యాగులను అందుబాటులో ఉంచాలన్నారు. అలాగే మండలంలో బకాయిపడిన రూ.2.44 కోట్ల నీటితీరువా బకాయిలు వసూలు చేయాలన్నారు. అనంతరం కొండచాకరాపల్లి సువర్ణముఖి నది వద్ద జరుగుతున్న పరిశుభ్రత పనులపై ఆరాతీసి, ఆ తర్వాత వంగరలోని ఓ రైస్‌మిల్లును తనిఖీ చేశారు. ఇదిలా ఉండగా, ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ.. ఆర్డీవోను కలిసి తహసీల్దారు కార్యాలయంలో నెలకొన్న సమస్యలను వివరించారు. తహసీల్దారుతో పాటు మిగతా రెవెన్యూ సిబ్బంది కూడా ప్రజలకు అందించే సేవల్లో అలసత్వం వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు దిరిశాల ధర్మరాజు, డీటీలు హరిరమణారావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో పౌష్టికాహారం అందివ్వాలి

వంగర: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిదారులకు సకాలంలో పౌష్టికాహారం అందివ్వాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సన్యాసమ్మ, రజనీదుర్గ, నూకాలమ్మలు సూచించారు. మండలంలోని ఎం.సీతారాంపురం, వంగర, అరసాడ గ్రామాల్లో ఐసీడీఎస్ సెక్టార్ సమావేశాలు గురువారం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందివ్వాల్సిన పౌష్టికాహారం క్రమం తప్పకుండా ఇవ్వాలని, రికార్డులు, ప్రీస్కూళ్ల నిర్వహణ బాగుండాలని తెలిపారు.

రేగిడి: మండలంలోని బూరాడ ఆదర్శ అంగన్‌వాడీ కేంద్రంలో బూరాడ సెక్టార్ కార్యకర్తల సమావేశం గురువారం నిర్వహించారు. ప్రతీ కార్యకర్త, ఆయా బాధ్యతగా పనిచేసి, కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలని సూపర్‌వైజర్ సుజాత సూచించారు.

మహనీయుడు జ్యోతీరావు పూలే



రాజాం సిటీ: పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీఎస్పీ నేతలు



బొబ్బిలి: జ్యోతీరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు

రాజాం సిటీ: కులవివక్ష నిర్మూలనకు, అన్యాయాలు ఎదుర్కొనేందుకు పాటుపడిన గొప్ప మహనీయుడు మహాత్మా జ్యోతీరావు పూలే అని బీఎస్పీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ బి.బుద్ధుడు కొనియాడారు. స్థానిక బీఎస్పీ కార్యాలయంలో పూలే వర్ధంతి గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పూలే పోరాటాల ఫలితంగా అణగారిన, బడుగు, బలహీన వర్గాలకు ఎంతో మేలు జరిగిందన్నారు. మహిళా విద్యకు మార్గదర్శకుడైన ఆయన త్యాగాలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో జె.నీలయ్య, డి.రామప్పడు, ఎం.శ్రీనివాసరావు, వి.పాపారావు, జి.తవిటయ్య, టి.మోహన్ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మహాత్మా జ్యోతీరావు పూలే వర్ధంతి గురువారం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్ నాయుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ గొలగాని రమాదేవిలు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. స్థానిక పట్టణంలోని బుడా(బొబ్బిలి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) కార్యాలయంలోనూ పూలే వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి రూరల్: మండలంలోని కోమటిపల్లి గ్రామ సమీపంలోని మహాత్మా జ్యోతీరావు పూలే గురుకులంలో పూలే వర్ధంతి గురువారం నిర్వహించారు.

సంక్షిప్తంగా...

గ్రామ సచివాలయం ప్రారంభం

బాడంగి: మండలంలోని తెంటువలస గ్రామంలో గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని ఎమ్మెల్యే బేబీనాయన గురువారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డొంకినివలస మిరువు ప్రాంత భూములకు సాగునీరు అందేందుకు వీలుగా పెద్దగెడ్డ నీటిని తెచ్చేందుకు కృషి చేస్తానన్నారు.

విద్యార్థులు ఏ-గ్రేడ్‌లో ఉండాలి

రాజాం సిటీ: విద్యార్థులంతా ఏ-గ్రేడ్‌లో ఉండేలా చూడాలని, ఆ దిశగా విద్యాబోధన కొనసాగించాలని ఎంఈవో వై.దుర్గారావు సూచించారు. స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని మెంటిపేట ఎస్సీ కాలనీ పాఠశాలను ఆయన గురువారం సందర్శించి, విద్యార్థులకు అందిస్తున్న రాగిజావను రుచి చూసి పరిశీలించారు. ఆంగ్లం, గణితం, తెలుగు సబ్జెక్టుల్లో విద్యార్థులు పట్టు సాధించేలా బోధించాలన్నారు.

నాణ్యత లోపిస్తే చర్యలు

బొబ్బిలి రూరల్: మండలంలోని నారసింహునిపేట, దిబ్బగుడ్డివలస, గోపాలరాయుడుపేట గ్రామాల్లో జరుగుతున్న రోడ్లు, కాలువల నిర్మాణాలను ఎంపీడీవో పి.రవికుమార్ గురువారం పరిశీలించారు. నిర్మాణాల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. అనంతరం నారసింహునిపేటలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం ఎంఈవో లక్ష్మణరావుతో కలిసి పరిశీలించారు. రుచి, శుచికరమైన భోజనం అందివ్వాలని ఆయన సూచించారు.

'ఉపాధి' పనులు చేపట్టాలి

రేగిడి: మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులు చేపట్టాలని ఏపీవో ఎస్.హరనాధరావు సూచించారు. మండలంలోని లక్ష్మీపురంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన గురువారం పరిశీలించి, పలు సూచనలు చేశారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ పని కల్పించాలని తెలిపారు.

బొబ్బిలిరూరల్: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లతో ఏపీవో లక్ష్మీపతిరాజు సమావేశమై, ఉపాధి పనులు వేగవంతం చేయాలని తెలిపారు.

ఎంపీడీవో పరిశీలన

బాడంగి: మండలంలోని తెంటువలస, పెద్దపల్లి గ్రామాల్లో నిర్మిస్తున్న క్యాటిల్ షెడ్లు(గోకులాలం/పశువుల కొట్టం)ను ఎంపీడీవో ఎస్.రామకృష్ణ గురువారం పరిశీలించారు. ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన ఈ షెడ్లను రెండు రోజుల్లోగా పూర్తి చేయకపోతే రద్దుకు సిఫార్సు చేస్తామన్నారు.

50 మద్యం సీసాల స్వాధీనం

రామభద్రపురం: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ దగ్గరలో అక్రమంగా తరలిస్తున్న 50 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వి.ప్రసాదరావు గురువారం తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి, జమ్మువలసకు చెందిన ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని, మద్యంసీసాలు పట్టుకున్నామని ఎస్ఐ పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

వంగర: మండలంలోని మద్దువలస జంక్షన్ వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు గురువారం నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్ఐ షేక్ శంకర్ హెచ్చరించారు. అలాగే ఎటువంటి ధ్రువీకరణ పత్రాలు లేని వాహనదారులకు అపరాధ రుసుం విధించారు.

రీసర్వేపై దుష్ప్రచారం

బొబ్బిలి: గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన రీసర్వేపై అప్పట్లో దుష్ప్రచారం చేసి, ఇప్పుడు అదే సర్వేను ఎలా కొనసాగిస్తారని రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేమిరెడ్డి లక్ష్మునాయుడు ప్రశ్నించారు. ఇదే విషయమై ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రాజకీయ లబ్ధి కోసం అప్పటి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను ఓ భూతంలా జనానికి చూపించారన్నారు. రెండు నాల్కల ధోరణి కూటమి ప్రభుత్వం అనుసరించడం సరికాదన్నారు.

రైస్‌మిల్లుల్లో ఆకస్మిక తనిఖీలు

తెర్లాం: మండల కేంద్రంలోని లక్ష్మీ జగన్నాథం ఆగ్రో రైస్‌మిల్లు సహా చాముండేశ్వరి, తిరుమల మోడరన్ రైస్‌మిల్లుల్లో తహసీల్దారు జి.హేమంత్‌కుమార్ గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ధాన్యం నిల్వలు పరిశీలించి, ఇప్పటివరకు ఎంతమంది రైతుల దగ్గర నుంచి ధాన్యం సేకరించారన్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైస్‌మిల్లులకు కేటాయించిన ట్రక్ షీట్‌ల ప్రాప్తికే ధాన్యం నిల్వలు ఉండాలని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ధాన్యం సేకరించినా, సంబంధిత రికార్డులు లేకపోయినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఆర్ఐ కృష్ణమూర్తి, వీఆర్వో డి.రాము తదితరులు ఉన్నారు.




మాట్లాడుతున్న ఆర్డీవో రామ్మోహనరావు

బొబ్బిలి: మండలంలోని దిబ్బగుడ్డివలస, కింతలివానిపేట రైస్‌మిల్లులను ఆర్డీవో జేవీఎస్ రామ్మోహనరావు గురువారం సందర్శించారు. ఇప్పటివరకు రైతుల నుంచి ఎంతమేర ధాన్యం సేకరించారు.. ఇంకా ఏ మేర ధాన్యం సేకరించాల్సింది ఉందని అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరణ, అన్‌లోడ్ చేయాలని సూచించారు.

పునర్వినియోగానికి చెత్త తరలింపు

రాజాం సిటీ: మున్సిపాలిటీలో సేకరించిన చెత్తను రీ యూజ్ (పునర్వినియోగం)కు తరలించనున్నామని మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు తెలిపారు. స్థానిక పట్టణంలో ఎనిమిది టన్నుల చెత్తను విశాఖపట్నంలోని జిందాల్ వేస్ట్ ఎనర్జీ ప్లాంట్‌కు తరలిస్తున్న కాంపాక్టర్ వాహనాన్ని ఆయన గురువారం జెండా ఊపి, ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఉత్పన్నమవుతున్న చెత్తను వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌కు తరలించడం ద్వారా విద్యుదుత్పత్తి అవుతుందన్నారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగించనున్నామన్నారు.



ఉపాధ్యాయుల నిరసన

ఏపీ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ పిలుపు మేరకు పలు పాఠశాలల్లోని ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో గురువారం నిరసన చేపట్టారు. వంగర మండలం, ఎం.సీతారాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో యూటీఎఫ్ మండల కార్యదర్శి పెంకి గౌరీశంకరరావు మాట్లాడుతూ రెసిడెన్షియల్ పద్ధతిలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడాన్ని తామంతా తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. గజపతినగరంలోని బాలాజీ పాలిటెక్నిక్ కళాశాలలో స్కూల్ లీడర్‌షిప్ ట్రైనింగ్‌లో మృతి చెందిన ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు కుటుంబానికి రూ.కోటి నష్ట పరిహారం అందివ్వాలని డిమాండ్ చేశారు. –వంగర



ఇలా వదిలేస్తే.. ప్రమాదం కాదా?

సంతకవిటి మండలంలోని జీఎస్ పురం, బొద్దూరు గ్రామాల మధ్య టెలికాం సంస్థ వారు ప్రతీ 100 గజాల దూరానికి ఓ గుంత చొప్పున తవ్వి వదిలేశారు. గుంత దగ్గరగా వస్తే తప్ప అక్కడ గుంత ఉందనే విషయం తెలీదు. ఈ నేపథ్యంలో ఇలా వదిలేస్తే ప్రమాదం కాదా అని వాహనదారులు, అటువైపుగా వెళ్తున్న వారు ప్రశ్నిస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే తప్ప గుంతలు పూడ్చి వేయరా అని నిలదీస్తున్నారు. –సంతకవిటి



చెత్త తీయడం మరిచారు..

పారిశుధ్య పనుల్లో భాగంగా రాజాం పట్టణంలోని మల్లిఖార్జున కాలనీలో మురుగు కాలువల్లో నుంచి తీసిన చెత్తాచెదారాన్ని రోడ్ల మీదే వదిలేశారు. దీంతో దుర్వాసన వెదజల్లుతోందని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శానిటేషన్ అధికారులు స్పందించి, పోగులుగా వదిలేసిన మురుగుకుప్పలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. –రాజాం